# తరుణోపాయం

■ ఎం. నాగమణి

సాయంత్రం అవుతూనే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో కోలాహలం మొదలైంది. తన రూమ్ ముందు బాల్కనీ లోంచి దూరంగా కనిపిస్తున్న సముద్రాన్ని చూస్తూ కూర్చుంది సరళ. బీచ్‌లో అటూ ఇటూ తిరుగుతున్న మనుషులు చీమల్లా కనిపిస్తున్నారు. నురగలు కక్కుతూ వచ్చే అలలు తెల్లని గీతల్లా కనిపిస్తున్నాయ్. గాలి మోసుకొస్తున్న హోరు చెవుల్ని తాకుతోంది. ఆలోచనల్లో పడిపోయింది సరళ. మనసులో జడివాన లాంటి అలజడి మొదలైంది. ఎంత నార్మల్‌కి రావాలని ప్రయత్నించినా అర్థం కాని ఆందోళన ఏదో అంతరాళంలోంచి పుట్టుకొచ్చి అశాంతి పాలు చేస్తోంది. రూమ్‌మేట్ రమణి వచ్చి తట్టి పిలిస్తేగానీ వాస్తవిక ప్రపంచంలోకి రాలేకపోయింది.

"అదేంటి సరూ ఇంకా ఇలానే కూర్చున్నావ్? సాయంత్రం పిక్చర్‌కు వెళ్దామనుకున్నాంగా నువ్వూ, నేనూ, రేవతీన్నూ. మర్చేపోయావా ఏం? లే లే అప్పుడే అయిదున్నర అయింది. నాకు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉండి ఆలస్యమయింది ఈ రోజు. త్వరగా రెడీ అయ్యామనుకో సినిమా టైమ్‌కు అందుకోవచ్చులే. అంతా అయితే ఆటోలో వెళ్ళిపోదాం. కమాన్. గెట్ రెడీ" అంటూ హడావిడిగా బాత్‌రూమ్ వేపు వెళ్ళింది రమణి. సరళకు అక్కడ్నుంచి లేవాలనిపించలా. స్తబ్ధుగా అలాగే కూర్చుండిపోయింది. అయిదు నిమిషాల్లో బట్టలు మార్చుకుని సరళ ముందుకొచ్చి నిలబడింది రమణి.

"అరే ఇంకా ఇలాగే కూర్చున్నావేంటి? లే లే" అంటూ సరళ చేయి పట్టుకుని లేపి నిలబెట్టింది.

"సారీ రమణీ నేను రాను. మీరిద్దరూ వెళ్ళండి" అంటూ నీరసంగా బాల్కనీ దగ్గరే నిలబడిపోయింది సరళ. అప్పటికి గానీ గమనించలేదు రమణి సరళ ముఖం పీక్కుపోయి ఉందనీ, దేని గురించో బాధ పడ్తోందనీ.

"అదేంటలా ఉన్నావ్ సరూ? ఒంట్లో బాగా లేదా" అంది కంగారుగా. తన వల్ల వాళ్ళ ఆనందం పాడుకావడం ఇష్టంలేని సరళ తన మనసులోని భావాల్ని దాచేసుకుంటూ పైకి నవ్వేసింది.

"అబ్బే బాగానే ఉన్నా రమణీ, కొంచెం అలసటగా ఉందంతే. ఆఫీసులో పని ఎక్కువగా ఉండిందీ రోజు. పెందలాడే ఇంత తిండి తిని నిద్రపోయాననుకో రేపటికంతా నార్మల్ అయిపోతుంది. మీరు వెళ్ళండి. టైమవుతోంది" అంటూ గబగబా రమణిని పంపేసింది అక్కణ్ణించి.

మళ్ళీ ఆలోచనల్లో పడింది. మధ్యాహ్నం సంఘటన గుర్తొచ్చింది. లంచ్ టైమ్‌లో ఆఫీసుకు పిల్చి కంపెనీ మానేజింగ్ డైరెక్టర్ రమాకాంత్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"సరళా. రండి రండి. ప్లీజ్ బీ సీటెడ్. ఎల్లుండి మీరూ నేనూ హైదరాబాద్ వెళ్తున్నాం అఫీషియల్ పని మీద" అన్నాడు సరళ వేపు ఒకలా చూస్తూ.

ఏదో పని మీద వచ్చి ఫైలు పట్టుకుని అక్కడే నిలబడ్డ టైపిస్టుని కొంచెం చురచురా చూశాడు రమాకాంత్. ఫైలు తీసుకుని గబగబా సంతకాలు పెట్టే కార్యక్రమం పూర్తి చేసి టైపిస్టును దాదాపు తరిమినంత పని చేశాడు. అతనటు వెళ్ళంగానే "హమ్మయ్య. శనిగాడు వదిలాడు. ఊఁ ఇప్పుడు నిన్నిక 'నువ్వు' అని సంబోధించవచ్చు" అన్నాడు ఎంతో చనువుగా సరళ వేపు చూస్తూ. ఆమెను ఇతరుల సమక్షంలో 'మీరు' అని సంబోధించడం, ఒంటరిగా దొరికితే 'నువ్వు' అని చనువు తీసుకోవడం అలవాటు రమాకాంత్‌కి.

"నే... నేనా? మీతో నేనెందుకు సార్ హైదరాబాద్‌కు" అంది సరళ ఎంతో తడబడుతూ.

"నువ్ రాందే ఎలా? నువ్ నా పర్సనల్ సెక్రటరీ అన్న విషయం మర్చిపోతున్నట్లున్నావ్" అన్నాడు రమాకాంత్ సరళ ముఖంలోకి గుచ్చిగుచ్చి చూస్తూ.

ఒంటిమీద చీమలు, జెర్రులు పాకినట్లు అనిపించింది సరళకు. గిరుక్కున తిరిగి వెళ్ళిపోదామనుకుంది కానీ, అది తన ఉద్యోగానికే ముప్పు తెస్తుందేమో అని తటపటాయించింది.

"నేను మీతో రావడం తప్పదంటారా" అంది అదురుతున్న గుండెల్ని అదుపులోకి తెచ్చుకుంటూ.

"మరంతేగా? అయినా ఏమిటి సరళా అంత కంగారు పడిపోతున్నావ్? నేనేమన్నా నిన్ను కొరుక్కుతినేస్తానని భయమా? ఎప్పుడు చూసినా అత్తపత్తి ఆకులా భయంగా ముడుచుకుపోవడమే కానీ కొంచెం సరదాగా, చనువుగా ఎప్పుడన్నా మూవ్ అయ్యావా నువ్వు? ఏమిటో నా ఆంతర్యాన్ని ఇప్పటికీ సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నావ్ సరళా. నువ్వంటే నాకెంత ప్రేమో నీకేం తెల్సు? నీ అందం అంటే నేనెంత పడిచస్తానో నీకేం తెల్సు? అసలు నీ అందాన్ని చూసే కదా ఇంటర్వ్యూకు అంత మంది వచ్చినా నిన్నే సెలెక్ట్ చేసుకుంది! అన్నాడు రమాకాంత్ పరవశించిపోతూ. సరళకు చేదుమందు మింగినంత పనయింది. ఆమె అదృష్టవశాత్తూ అతని భార్య దగ్గర్నుండి ఫోన్ రావడంతో బతుకు జీవుడా అనుకుంటూ రూమ్‌లోంచి బయట పడింది.

మధ్యాహ్నమంతా ఎవరెవరో విజిటర్స్ రావడంతో రమాకాంత్ బిజీగా ఉండడంతో సరళ హాయిగా ఊపిరి పీల్చుకుంది. ఆఫీసు టైమ్ అవుతూనే ఎవరో తరుముకు వస్తున్నట్లు గబగబా హాస్టల్‌కు దారిపట్టింది. రమాకాంత్ తీసుకుంటున్న మితిమీరిన చనువుకు ఎలా ఫుల్‌స్టాప్ పెట్టాలో అర్థంకాక తికమక పడిపోయంది సరళ.

ఆలోచనలన్నీ ఓ పక్కకు నెట్టి మళ్ళీ బాల్కనీ లోకి వచ్చి నిలబడింది. సముద్రం వేపు నుంచి చల్లని గాలి వీస్తున్నా ఉక్కపోస్తున్నట్లు, ఊపిరాడనట్లు అనిపించింది. ఏం చేయాలో, పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు సరళకు. ఉద్యోగం సద్యోగం వదిలేసి ఊరికి పారిపోదాం అనిపించింది. కానీ, తన బతుకుతెరువు, తన ఇంట్లో వాళ్ళందరి బతుకుతెరువు తన ఉద్యోగం పైనే ఆధారపడి ఉందని గుర్తుకు రాగానే ఆవేశానికో ఆనకట్ట పడిపోయింది. ఏదో నెలకింత డబ్బు పంపుతూంటే గుట్టుగా కాలం వెళ్ళదీసుకు వస్తున్నారు ఇంట్లో. ఈ ఆధారం కూడా లేకపోతే ఎలా అనుకుంది దిగులుగా. పోనీ మరొక ఉద్యోగం చూసుకుంటేనో అనుకుందో క్షణం. అసలు ఉద్యోగం దొరకడం ఎంత కష్టం. దొరికినా అక్కడి పై అధికారులు మాత్రం రమాకాంత్ కంటే మెరుగు అన్న భరోసా ఏమిటి? పైగా ఇతను కొద్దో గొప్పో గౌరవం ఇచ్చి మాట్లాడతాడు. పరువూ మర్యాదలకు కాస్త విలువిస్తాడు. మిగతా చోట దురదృష్టవశాత్తూ అన్నింటికీ తెగించిన రకాలు ఎదురౌతేనో? అనుకుంది సరళ భయంభయంగా, దూరంగా కనిపిస్తున్న సముద్రం వేపు చూస్తూ. రమాకాంత్ ప్రవర్తన మళ్ళీ గుర్తొచ్చింది. మర్నాడు ఆఫీసుకు వెళ్ళాలంటేనే ఒకలాంటి జంకు పట్టుకుంది. వాచీ చూసుకుంది. ఏడున్నర. డైనింగ్ హాల్‌కు వెళ్ళి పట్టెడు మెతుకులు తినాలని కూడా అనిపించలా. అలమరాలోంచి రెండు బిస్కెట్లు, రెండు అరటి పండ్లు తీసుకుని తిని మాగజైన్ ముందేసుకు కూర్చుంది. తొమ్మిది దాటాక మంచంపై వాలింది. కంటిపై కునుకైతే రాలేదు కానీ కళ్ళ నిండుగా కన్నీళ్ళు మాత్రం చేరుకున్నాయ్. హృదయంలోంచి ఏదో ఆవేశం, ఆక్రోశం వరదలా ముంచుకొచ్చి ఉక్కిరిబిక్కిరి చేశాయ్.

స్త్రీకి శీలం ముఖ్యం అంటారు. చదువు ముఖ్యం అంటారు. ఉద్యోగం ముఖ్యం అంటారు. ఆర్థిక స్వాతంత్ర్యం ముఖ్యం అంటారు. మరి ఈ ముఖ్యమైన వాటన్నింటినీ సొంతం చేసుకోవాల్సిన స్త్రీకి తగిన రీతిలో రక్షణ కలిగించరేం అనుకుంది పదేపదే. ఎప్పటికో గానీ నిద్ర పట్టలేదు సరళకు. ఒక్కోసారి ఒక్క ఆలోచన అణువణువునూ కదిల్చి వేస్తుంది. ఆత్రంగా మనసును ఆక్రమించుకుంటుంది. ఆ ఒక్క ఆలోచన కంటిమీద కునుకు రానీయకుండా కాపలా కాస్తుంది. కన్నీళ్ళల్లో ముంచుతుంది. చివరికి కలలా మాయం అవుతుంది. కానీ, సరళ మనసులో దూరిన ఆలోచన అలా కలలా కూడా మాయం అవలేదు!

మర్నాడు ఆదివారం అవడంతో కాస్తంత తీరిగ్గా లేచారు సరళ, రమణీన్నూ. రాత్రంతా నిద్ర లేక తల భారంగా అనిపిస్తున్నా ఆ అలసట ముఖంపై రానీయకుండా ఉండేదానికి ఎంతో సతమతమయింది సరళ.



బ్రేక్ ఫాస్ట్ తీసుకున్న తరువాత ఇద్దరూ బీచ్ వేపు నడిచారు. వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఆకాశం నిండా కమ్ముకున్న మబ్బులు సూర్యుడి తీక్ష కిరణాలని భూమి పైకి రానీయకుండా జాగ్రత్త పడ్తున్నాయ్. బీచ్ దగ్గర ఎంతో ప్రశాంతంగా ఉంది. పెద్దగా జన సంచారం, దాని తాలూకు కోలాహలం లేదు ఆ సమయంలో. ఒక సిమెంట్ బెంచ్ పై కూర్చున్నారిద్దరూ. వస్తూ పోతూన్న అలల్ని గమనిస్తూ ఉండిపోయింది సరళ. వింతగా అనిపించింది రమణికి. సరళనలా చూస్తుంటే బాధనిపించింది కూడా. "ఎందుకలా ఉన్నావ్ సరూ? నిన్న సాయంత్రం నుంచి గమనిస్తున్నా. అదోలా ఉన్నావ్. ఏం జరిగింది? చూడు సరూ. మన బాధని మరొకరితో పంచుకుంటే తేలిక పడ్తుంది హృదయం. ఊఁ! చెప్పు. అసలు ఏం జరిగింది" అంటూ నిలదీసింది రమణి.

ఆ ఆత్మీయతకి ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది సరళకు. "నాకెందుకో మా ఊరెళ్ళిపోదాం అనిపిస్తోంది రమణి" అంది దిగులుగా చూస్తూ.

"ఓహ్. అదా సంగతి! మీ వాళ్ళు గుర్తొస్తున్నారా? రెండు రోజులు సెలవు పెట్టి బస్సెక్కేయ్. వెరీ సింపుల్."

"అహ. అదికాదు సంగతి. ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసి వెళ్ళిపోదామనిపిస్తోంది."

ఉలిక్కిపడింది రమణి ఆ మాట వింటూనే. కానీ, తమాయించుకుంది. "అసలు స్పృహలో ఉండే మాట్లాడుతున్నావా? ఇంతమంచి ఉద్యోగం వదిలేస్తావా? ఇలాంటి అవకాశం నీకు జన్మలో మళ్ళీ దొరుకుతుందా సరూ? అవునూ. పెళ్ళీగిళ్ళీ ఏమైనా సెటిల్ అయిందా ఏమిటి" అంది నవ్వేస్తూ. "ఛ. అలాంటిదేం లేదు రమణీ! ఇది కేవలం ఉద్యోగానికి సంబంధించిన సమస్యనే. ఇంతకాలం నుంచి నీకీ విషయాలు చెప్పలేదు నేను. జీవితంలో కొన్ని హంగులు అవసరం అయినట్లే కొన్ని హద్దులూ

"సరూ, రమాకాంత్ వాంట్స్ టూ హావ్ యాన్ ఎఫైర్ విత్ మీ. అతని అభిప్రాయం అతని మాటల్లో, చేతల్లో, అతని కళ్ళల్లో స్పష్టంగా తెలిసిపోతోంది. కానీ, నేనందుకు సిద్ధంగా లేను."

అవసరమే కదూ! అలాంటి హద్దుల్ని దాటుతున్నాడీ మధ్య మా మేనేజింగ్ డైరెక్టర్ రమాకాంత్. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఏదో ఒక రిమార్క్, ఏదో ఒక కామెంట్ పాస్ చేస్తూనే ఉంటాడు."

"ఎందుకలా అపార్థం చేసుకుంటావ్? ఆయన కేవలం నీ స్నేహాన్ని ఆశిస్తున్నాడేమో."

"ఇద్దరి మధ్య బాంధవ్యం అందంగా, ఆనందంగా సాగిపోవాలంటే వాళ్ళ స్నేహంలో స్వార్థం అనే కల్తీ ఉండకూడదు. ఒకరి నుంచి ఒకరు ఏదీ ఆశించకుండా, స్నేహాన్ని స్నేహంగానే కాపాడుతూ ఆ పరిధిల్లోనే ఉంటూ, ఆ సరిహద్దులోనే సరిపెట్టుకుంటూ ఉంటే ఆ ఇద్దరి మధ్యా మర్యాదా దక్కుతుంది, ఇతరుల మన్ననా దొరుకుతుంది. కానీ సరూ, రమాకాంత్ వాంట్స్ టూ హావ్ యాన్ ఎఫైర్ విత్ మీ. అతని అభిప్రాయం అతని మాటల్లో, చేతల్లో, అతని కళ్ళల్లో స్పష్టంగా తెలిసిపోతోంది. కానీ, నేనందుకు సిద్ధంగా లేను. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగం వదిలి పారిపోవడం కంటే మరో

చిత్రాలు: నర్సిం



గత్యంతరం ఏం ఉంది నాకు" అంది సరళ బేలగా చూస్తూ. ఆమెనలా చూస్తుంటే ఉసూరుమనిపించింది రమణికి. కొంచెంసేపు ఆలోచిస్తూ ఉండిపోయింది.

చివరికి గలగలా నవ్వేసింది. ఆ నవ్వులోని ఆంతర్యం అర్థం కాని సరళ తెల్ల ముఖం వేసి చూస్తూ ఉండిపోయింది.

"పోనీ నాలుగు రోజులు సరదాగా తిరగరాదూ అతని చుట్టూ ఓ ఉప గ్రహం లాగా! కార్లో తిప్పుతాడు. పార్కులకీ, బీచ్‌లకీ, సినిమాలకీ, షికార్లకీ తీసుకెళ్తాడు. మంచి కాలక్షేపం" అంది రమణి ఇంకా అలాగే నవ్వుతూనే. ఒళ్ళు మండింది సరళకు.

"చాల్లే నీ వేళాకోళం నువ్వూనూ. అలా ఊహించుకోడానికే అసహ్యంగా ఉంది. అయినా నేనలాంటి అమ్మాయినిగా కనిపిస్తున్నానా నీ కళ్ళకు" అంది ఉక్రోషంగా చూస్తూ. "ఛ. నువ్వెలాంటి దానివో నాకు తెలీదా. ఏం. కాకపోతే ఒక్కోరకం సమస్యకు ఒక్కోరకం పరిష్కారం అన్నా అంతే" అంది రమణి స్నేహపూర్వకంగా సరళ భుజంపై చేయి వేసి.

సముద్రంపై పడుతూ లేస్తూన్న కెరటాన్ని చూస్తూ ఉండిపోయింది సరళ. కాసేపు అయ్యాక రమణి ముఖంలోకి చూసింది. కళ్ళల్లో చెప్పలేనంత అధైర్యం కనిపిస్తోంది. "ఉద్యోగం దొరికిందన్న రోజున ఎవరెస్ట్ శిఖరం ఎక్కినంత ఆనందం కలిగింది రమణీ నాకు. నాన్న రిటైర్ అయ్యాడు. పెన్షన్ డబ్బులు ఇంటి ఖర్చులకే చాలవు. చెల్లెలు, తమ్ముడు చదువులకు మరింత డబ్బు అవసరం. అర్ధంతరంగా వాళ్ళ చదువుల్ని ఆపడం చాలా అన్యాయం అనిపించింది. అందుకే నాకు ఉద్యోగం దొరకడం, అదీ అంత మంచి కంపెనీలో, మా అందరి అదృష్టం అనుకున్నా. 'మీరింత అందంగా ఉండబట్టే ఈ ఉద్యోగం మీకు ఇస్తున్నా' అన్నాడు రమాకాంత్ అందరూ వెళ్ళిపోయాక నన్ను పిలిచి నాకు ఉద్యోగం ఇస్తున్నానని తెలియజేస్తూ. అతడి కామెంట్ నచ్చకపోయినా నా అశక్తత వల్ల ఆత్మాభిమానాన్ని కొంచెం పక్కకు నెట్టి ఉద్యోగంలో చేరిపోయా. రోజూ ఏదో ఒక నెపంతో ఆఫీసుకు పిలవడం, నా చీర బాగుందనో, నా గాజులు బాగున్నాయనో, నా జడ బాగుందనో, జడలో పూలు బాగున్నాయనో... రోజూ ఇలా ఏదో ఒక రన్నింగ్ కామెంటరీ. మనసులో ఎంత కోపం రగులుతున్నా పైకి మామూలుగా ఉండడం అలవాటు చేసుకున్నా. ఉద్యోగంలో చేరిన ఆరు నెలలకే ప్రమోషన్ అంటూ పర్సనల్ సెక్రెటరీ పదవి అందించాడు. క్వార్టర్స్ కూడా ఇస్తానన్నాడు. నాలాంటి ఒంటరిదానికి ఇలాంటి వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ బెటర్ అనిపించి క్వార్టర్స్ వద్దనేశా. ఆ మధ్య ఒక ఆదివారం ఇక్కడి కొచ్చాడు. నువ్ నీ కొలీగ్ వాళ్ళింటికెళ్ళావ్. మర్యాద కోసం విజిటర్స్ రూమ్‌లో కూర్చోబెట్టా కొంచెం సేపు. "సరళా! నువ్వంటే నాకెంత ఇష్టమో మాటల్లో చెప్పలేను. నిజం చెప్పాలంటే నువ్ నా ఆరాధ్య దేవతవు. కాకపోతే కఠినాత్మురాలివి. వరాలివ్వని దేవతవి" అంటూ సినిమా డైలాగ్స్ మొదలు పెట్టాడు. నాకైతే ఒంటిపై ముళ్ళు గుచ్చుకున్నట్లు అనిపించింది. కానీ, పైకి మాత్రం పొలైట్‌గా, "చూడండీ రమాకాంత్ గారూ! వివాహితులై ఉండి, నా పై ఆఫీసరై ఉండి మీరిలా మాట్లాడడం భావ్యం కాదు" అన్నా. నేనలా అంటూనే ముఖం అదోలా పెట్టేసుకున్నాడు. 'ఆఁ ఏం వివాహితుణ్ణిలే. ఏమైనా సుఖమా, సంతోషమా ఇంట్లో. మా ఇద్దరి ఆలోచనలు, అభిప్రాయాలు సమాంతర రేఖల్లా ప్రయాణం చేస్తుంటాయ్. అందుకేగా ఈ ప్రేమ దాసుడు నీ వెంట పడేది' అంటూ నా చేయి పట్టుకోబోయాడు. అదృష్టవశాత్తూ, విజిటర్స్ రూమ్‌లోకి ఎవరో రావడంతో అలాంటి ప్రయత్నం మానుకున్నాడు" అంది సరళ ఓ గులకరాయి తీసుకుని సముద్రం వేపు గిరాటేస్తూ. ఓ క్షణం ఊపిరి పీల్చుకొని మళ్ళీ

చెప్పడం ప్రారంభించింది సరళ.

"మరొకసారి హాస్టల్‌కు నడిచి వస్తుంటే లిఫ్ట్ ఇస్తానని ఒకటే మొహమాటం పెట్టి, తీరా కారులో కూర్చున్నాక అర్థం పర్థం లేని వాగుడు మొదలు పెట్టాడు. నా కళ్ళు మరో లోకానికి తీసుకుపోతాయట అతణ్ణి. నా స్వరం వీణ మీటినట్లు ఉంటుందట. నా నవ్వు సెలయేరులా గలగలమంటుందట. నా నడక హంస నడక అట. అలా ఏదేదో వాగుడు. కొంచెం సేపు అదంతా సహించి దార్లో సెంటర్లో దిగేశా ఏదో పని ఉందని వంక బెట్టి. గట్టిగా ఓ చెంప దెబ్బ ఇవ్వాలనిపించింది రమణీ అతనలా వాగుతుంటే. కానీ, మర్నాడే ఉద్యోగం లోంచి డిస్మిస్ అవుతాను. అతనలాంటి నిర్ణయం తీసుకోడానికి వంద కారణాలు వెతుక్కోగలడు. తన ఒక తప్పుని కప్పిపుచ్చుకోడానికి నాలో వంద తప్పులు సృష్టిస్తాడు. నాలో ఒక్క తప్పూ లేదని రుజువు చేసుకోడానికి నాకున్న స్టేటస్ చాలదు. మధ్యతరగతి బతుకు చాలదు, ఆర్థిక స్తోమత చాలదు. ఇక ఏవేవో అపనిందలు నెత్తి నేసుకుని మౌనంగా ఆఫీసు గేటు దాటి నేరుగా మా ఊరికి దారిపట్టాలి. ఇదీ పరిస్థితి. ఛ. మధ్యతరగతి కుటుంబంలో ఆడపిల్లగా పుట్టడం, ఉద్యోగం చేయాల్సి రావడం, అదీ రమాకాంత్ లాంటి వాళ్ళ దగ్గర... నిజంగా దురదృష్టకరమైన విషయం. పోనీ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసిపోదామంటే అలాగూ చేయలేను. కానీ, పరిస్థితులు మరీ అనుకూలించకుండా పోతే, పరిణామాలు మరింత అధ్వానంగా మారితే ఇక నేను అలాంటి నిర్ణయం తీసుకోక తప్పదేమో" అంది సరళ నిట్టూరుస్తూ. ఎంతో బాధ అనిపించింది రమణికి.

"ఏమిటో సరూ. కొందరు మగవాళ్ళు ఎందుకిలా ప్రవర్తిస్తారు అనిపిస్తుంది. ఇంట్లో అంత అందం, ఆరోగ్యం, చదువు, సంస్కారం ఉన్న భార్యని పెట్టుకొని రమాకాంతే ఇలా ప్రవర్తిస్తున్నాడంటే అది కేవలం అతని దురదృష్టం అనాలి. లేదా అతని భార్య దురదృష్టమో మరి" అంది నిట్టూరుస్తూ రమణి.

"నీకు తెల్సా రమాకాంత్? మరి ఆ సంగతి ఇన్నాళ్ళూ చెప్పలేదేం నాకు" అంది సరళ ఎంతో ఆశ్చర్యపోతూ.

"ఈ మధ్యే తెల్సింది ఇతని గురించి. నా కొలీగ్ ఒకామె ఇతనికి దగ్గర చుట్టం. ఆవిడ చెప్పింది వీళ్ళ గురించి. రమాకాంత్ భార్య చాలా మంచిదట. చాలా అందంగా, చలాకీగా, చాలా సోషల్‌గా ఉంటుందట. ఎమ్.ఏలో గోల్డ్ మెడలిస్ట్ అట. లెక్చరర్‌గా పని చేస్తోంది. కానీ, రమాకాంత్ విషయాలేవో ఆవిడకు తెలీదనుకుంటా. అతనూ మంచివాడే అన్నట్లు మాట్లాడింది మరి. ఎంతయినా బంధువులు కదా. అందుకే బయటపడలేదేమో."

"మరి రమాకాంత్‌కిదేం పోయేకాలం" అంది సరళ విస్తుపోతూ.

"అది అతని వీక్‌నెస్ సరూ. లేదా కాంప్లెక్స్. కొందరు షాపింగ్‌కని వెళ్ళి అక్కడి వస్తువుల్ని కొన్నింటిని దొంగతనంగా పర్సులోనో, జేబులోనో వేసేసుకుంటూ ఉంటారు. అది వాళ్ళ మానసిక బలహీనత. తేరగా దొరికిన వాటిల్లో వాళ్ళకు వజ్రాలు, వైఢూర్యాలు కనిపిస్తాయ్. వాళ్ళు దొంగతనంగా అలా తీసుకున్న వస్తువులకంటే ఇంకా విలువైనవి ఎన్నో వాళ్ళ ఇంట్లో ఉండొచ్చు. కానీ, దొంగిలించి తెచ్చుకున్న వస్తువులే మరింత విలువైనవిగా కనిపిస్తాయ్ వాళ్ళకు. అదో రకమైన జబ్బు."

మౌనంగా వింటూ ఎటో చూస్తూ ఉండిపోయింది సరళ.

"నీ సమస్యకు ఒక్కటే పరిష్కారం సరూ" అంది రమణి.

ఉన్నట్లుండి హఠాత్తుగా ఏమిటన్నట్లు తలతిప్పి చూసింది సరళ.

"ఓసారెప్పుడో నీకు ముత్యాల సెట్ కొనిస్తానన్నాడని, నువ్ సున్నితంగా తిరస్కరించావని చెప్పావ్ గుర్తుందా?"

"అవును. అయితే?"

"ఈసారి ఓ పని చెయ్. నీ అంతట నువ్వే అడిగేయ్. ఓ ముత్యాల సెట్, అరడజను బంగారు గాజులు, రెండు పేటల బంగారు గొలుసు, ఓ యాభై వేలు రొఖ్ఖం, వీలైతే ఒక ఎపార్ట్‌మెంట్... ఇలా నీనోటికొచ్చినవన్నీ కొనివ్వమని డిమాండ్ చేసేయ్. అప్పుడు నీ వెంటబడ్డం మానేస్తాడు. పెళ్ళి చేసుకోమని డిమాండ్ చెయ్. అతని భార్యకు డైవోర్స్ ఇమ్మని పట్టి పీడించు. ఇక అంతే. నువ్వంటే భయపడి చస్తాడిక. నీ జోలికి రాడు ఈ జన్మలో."

"ఛ. ఇవేం డర్టీ జోక్స్ రమణీ" అంది సరళ నొచ్చుకుంటూ.

"జోక్స్ కాదు. ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్స్ ఇది. మా ఆఫీసులో టైపిస్ట్ ఇలా చేసి ఎంతో అసహ్యకరమైన, ఎంతో క్లిష్టమైన పరిస్థితి నుండి తప్పించుకుంది మరి."

"ఛ అదేం పని" అంది సరళ విసుగ్గా ముఖం పెట్టి.

"ఏం చేయమంటావ్ మరి? ఒక్కోరకం నీతికి ఒక్కోరకం రీతి మరి! ఇంట్లో ఇల్లాలు, బయట ప్రియురాలు– ఇదొక ఫ్యాషన్, ఇదొక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది ఈ మధ్య కొందరికి. కొన్ని కథలూ అలాంటివే వస్తున్నాయ్. కొన్ని సినిమాలూ అలాంటివే వస్తున్నాయ్. సినిమా తెరపై చూసిందల్లా నిజ జీవితంలో నిజం చేసుకుందాం అని ఉవ్విళ్ళూరుతుంటారు కొందరు. ఆ హీరోల్లా తిరిగేద్దాం అని తాపత్రయపడతారు. పెద్ద ఇల్లు, చిన్న ఇల్లు అంటూ కలలు కనేస్తూ ఉంటారు. మరి అలాంటి వాళ్ళకి బుద్ధి చెప్పాలంటే కుక్క కాటుకి చెప్పు దెబ్బ తప్పదు. అఫ్‌కోర్స్, ఇదొక మార్గం. ఇది నీకు నచ్చకపోతే మరో పరిష్కారం గురించి మళ్ళీ ఆలోచిద్దాం. పద లంచ్ టైమ్ అవుతోంది" అంటూ లేచి నిల్చుంది రమణి. ఇక ఆ టాపిక్ అంతటితో వదిలేసి హాస్టల్ దారి పట్టారు స్నేహితురాళ్ళిద్దరూ.

> "వేరే ఎవరన్నా అలా ప్రవర్తిస్తే ఆ పిల్లను కాపాడాల్సిన నైతిక బాధ్యత మీది. మీరే అలా అలుసు తీసుకుంటే... కంచే చేను మేసినట్లు కాదా? మీరు సరళను మానసికంగా ఎంత కుంగదీశారో మీకు తెలీదండీ."

ఆ రాత్రి రమణి మాటల్ని గుర్తు చేసుకుంటూ మళ్ళీ ఆలోచనల్లో పడింది సరళ. మగవాళ్ళ అఘాయిత్యాలకి అన్యాయంగా బలయిన స్త్రీలెందరో మనసులో మెదిలారు. ఆర్థికంగా మెరుగవ్వాలని, ఆత్మాభిమానం నిలుపుకోవాలని, అంతో ఇంతో చేదోడు వాదోడుగా ఉండాలని, అన్యాయం, అక్రమం ఎదుర్కోవాలని స్త్రీ ఎంత తహతహలాడుతూ, ఎంత ఆశతో నాలుగు గోడలు దాటి బయటకు వస్తోంది. కానీ, ఆమెకు రక్షణ కల్పించేదెవరు? ఎందరికి సరయిన న్యాయం జరుగుతోంది? ఎందరు స్త్రీలు నిశ్శబ్దంగా రోదిస్తూ కాలం గడపడం లేదు? ఎందరు నిశ్చయమైన గమ్యం గోచరించక, నిస్పృహ నీడలో నిశ్చలంగా, నిస్సహాయంగా నిలచిపోవడం లేదు? ఎందరు నీటి బిందువుల్లా జీవితపు ఎడారిలో ఎక్కడో రాలిపోయి రూపం కోల్పోయి ఇసుక పర్రలపై పడి ఉండడం లేదు నిస్తేజంగా? ఎందుకిలా జరుగుతోంది అనుకుంది కిటికీ గుండా కనిపిస్తున్న తారల్ని తదేకంగా చూస్తూ. చల్లని గాలి వీస్తున్నా ఎంతో ఉక్క పోస్తున్నట్లు అనిపించింది సరళకు. ఆలోచించి ఆలోచించి చివరికి ఓ నిర్ణయానికి వచ్చింది. ఆ తరువాత నిశ్చింతగా నిద్రపోయింది.

రెడు రోజుల తరువాత ఆఫీసుకు లీవు లెటర్ పంపించి తను తిన్నగా రమాకాంత్ భార్య నళిని ఉద్యోగం చేస్తున్న కాలేజీకి వెళ్ళింది. ఏదీ దాచకుండా ఉన్నదున్నట్లు నళిని ముందు పెట్టింది.

"మేడమ్, ఇదీ సమస్య. దీనికి సరయిన తరుణోపాయం మీరే ఆలోచించాలి. మీకు ముందే చెప్పానుగా నా స్నేహితురాలు ఇచ్చిన సలహా నాకెంతమాత్రమూ రుచించలేదు. అందుకే మీ దగ్గరకు వచ్చింది, ఓ సాటి స్త్రీగా మీరు నాకు మేలు చేస్తారన్న గంపెడంత ఆశతో. నా ఉద్యోగంపై మరో నలుగురి జీవితం ఆధారపడి ఉంది. మీరు వెతికే సమస్యా పరిష్కారంపై నా ఫ్యూచర్ అంతా ఆధారపడి ఉంది మేడమ్. అప్పుడు నిర్ణయించుకుంటాను బతకాలా, చచ్చిపోవాలా అని" అంది కన్నీళ్ళు ఆపుకుంటూ. మానసికంగా ఎంతగానో అలసిపోయిన సరళకు నళిని ఓ పెన్నిధిలా కనిపించింది. స్నేహపూరితమైన ఆమె ప్రవర్తన ఎంతో హృదయానికి హత్తుకొనేలా చేసింది.

"ఛ. అలా జావగారిపోకు సరళా. అయామ్ సో సారీ ఫర్ వాటెవర్ హాపెండ్. నీ బతుకు బాగు చేయడమే కాకుండా, నా బతుకూ బాగుచేసుకోవాలిగా. రమాకాంత్ స్వతహాగా మంచివాడు. మర్యాదకి విలువిస్తాడు. కానీ, ఏదో బలహీనత అతణ్ణలా ప్రవర్తించేలా చేసినట్లుంది. ఒక స్త్రీ ఒంటరిగా బతుకుతోందంటే మరింత అలుసు కొందరు మగవాళ్ళకు. పైగా అందాన్ని ఆస్వాదించడమే కాకుండా, ఆరాధించడమూ చేతనయినప్పుడే ఇరువురి పరువూ దక్కేది అన్న విషయం చాలా మంది విస్మరిస్తూ ఉంటారు సరళా. ఏ పనయినా అనాలోచితంగా, అవివేకంగా చేస్తే అభాసుపాలవ్వాల్సి వస్తుందన్న విషయం గ్రహించరు" అంది నళిని ఆవేదన నిండిన స్వరంతో. సరళను చూస్తుంటే చెప్పలేనంత జాలి, సానుభూతి కలిగింది. ఎంతో ధైర్యం చెప్పి పంపించింది. ఇక ఆ సమస్య గురించి మర్చిపొమ్మని మరీ మరీ చెప్పింది.

సాయంత్రం ఇంటికి వచ్చాక ఉదయపు సంఘటన గురించి చాలా సేపు ఆలోచిస్తూ కూర్చుంది నళిని. ముఖం కడుక్కుని బట్టలు మార్చుకొని, బాల్కనీలో కుర్చీ వేసుకుని కూర్చుంది. టైమ్ చూసింది. అయిదవుతోంది. అంటే మరో అరగంటలో రమాకాంత్ వస్తాడు. ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి అనుకుంటూ .మళ్ళీ ఆలోచనల్లో పడింది. సరళ గుర్తొచ్చింది. సరళ మాటలు గుర్తొచ్చాయ్. రమాకాంత్‌తో తన ప్రేమ వివాహం గుర్తొచ్చింది. అయోమయ స్థితిలో పడేస్తున్న ఆధునిక విలువలు గుర్తొచ్చాయ్. ప్రస్తుతం ఎదుర్కోవాల్సిన సమస్య గుర్తొచ్చింది. అన్నీ కలిసి మనసును మరింత గజిబిజి చేశాయ్. కారు హారన్ శబ్దానికి ఈ లోకంలోకొచ్చి పడింది.

"హాయ్ డార్లింగ్. ఇక్కడున్నావా? అదేంటీ ఇంకా తయారవలేదూ? మీ కజిన్ వాళ్ళింటికి వెళ్దాం సాయంత్రం అని అన్నావ్‌గా పొద్దున్న" అంటూ హడావిడిగా నళిని ముందుకొచ్చి నిలబడ్డాడు రమాకాంత్.

"అలా కూర్చోండి. ముందు టీ తాగండి. తరువాత చాలా ముఖ్యమైన విషయం గురించి డిస్కస్ చేయాలి" అంటూ టీ అందించింది నళిని. అప్పుడు గ్రహించాడు రమాకాంత్ భార్య ముఖం వాడిపోయి ఉందని.

"ఏంట్రా అలా ఉన్నావ్? ఒంట్లో బాగా లేదా" అంటూ నళిని నుదుటిపై చేయివేసి చూశాడు.

"అబ్బే. జ్వరం ఏం లేదులే. ఒంట్లోకేం? ఒంట్లో బాగానే ఉంది. బాగా లేంది మనసే" అంది సూటిగా రమాకాంత్ ముఖంలోకి చూస్తూ.

"అరే. ఏమైంది నళినీ. కాలేజీలో ఏదన్నా

ప్రాబ్లమా?" అన్నాడు రమాకాంత్ కంగారు పడుతూ.
"అవును. కాలేజీలో ప్రాబ్లమే. మా కొలీగ్ ఒకతను నా వెంట పడ్తున్నాడీ మధ్య. నేను చాలా అందంగా ఉంటానట. చాలా అందంగా మాట్లాడతానట. అందంగా నవ్వుతానట. అందంగా నడుస్తానట. నన్ను మర్చిపోలేకపోతున్నాడట. అందుకే నా కంపెనీ కావాలని తహతహలాడిపోతున్నాడు. మొన్న ఆ మధ్య సినిమా కెళ్దామన్నాడు. హోటల్‌కు పోదామని సజెస్ట్ చేశాడు. ఈ రోజయితే అతని వైఫ్ ఇంట్లో లేదట. ఇంటికే రమ్మని ఆహ్వానం పలికాడు. ఇంకా..." నళిని మాట పూర్తికాక ముందే ఎంతో ఆవేశపూరితంగా అడ్డుకున్నాడు రమాకాంత్. "స్టాపిట్. స్టాప్ ద నాన్సెన్స్. ఎవడు? ఎవడు వాడు? ఎవడా ఫూల్? చెప్పు ముందు. మీ ప్రిన్సిపాల్‌కు చెప్పి కమిటీ మీటింగ్ పెట్టించి రేపీపాటికి వాడ్ని ఉద్యోగం లోంచి పీకించేస్తాను. ఏమనుకుంటున్నాడో రోగ్" అన్నాడు కోపంతో ఊగిపోతూ.

"అవును. నాకు మీరు ఉన్నారు కాబట్టి అతణ్ణి ఉద్యోగం లోంచి పీకించేస్తారు. పాపం సరళ. అదే మీ పర్సనల్ సెక్రటరీ. ఆపిల్లకెవరున్నారు మిమ్మల్ని ఉద్యోగంలోంచి పీకించేయడానికి" అంది నళిని ఎగతాళిగా చూస్తూ. ఆమాటకు అదిరిపడ్డాడు రమాకాంత్. కాళ్ళ కింది భూమి కదుల్తున్న భావన కలిగింది అతనిలో.

"సరళ... సరళ నీకెలా తెల్సు?" అన్నాడు తొట్రుపాటుతో.




ఎలా తెల్సు అన్న విషయం అప్రస్తుతం లెండి. చూడండి. అన్నం కంటే అప్పుడప్పుడూ తినే ఐస్‌క్రీమ్ అద్భుతంగా ఎంతో రుచికరంగా అనిపిస్తుంది. అలా అని ఐస్‌క్రీమ్‌ని అన్నంలా తినలేం కదా! అన్నమంత తినలేం కదా! కొన్ని కొన్ని బాంధవ్యాలూ అంతే. బతకాలంటే అన్నం అవసరం. ఐస్‌క్రీమ్ తినకపోయినా కొంపలేం మునిగిపోవు. కానీ, మీరు అన్నం వద్దు, ఐస్‌క్రీమ్‌నే తింటాను అంటే అదిక మీ ఇష్టం. కాకపోతే మనిద్దరం వేరు వేరు దారులు వెతుక్కోవాల్సి వస్తుంది అప్పుడు" అంది నళిని తాపీగా ఎలాంటి నదురూ బెదురూ లేకుండా. రమాకాంత్ తల మరింత వాలిపోయింది. బెల్లంకొట్టిన రాయిలా ఉండిపోయాడు మాటా పలుకూ లేకుండా.

"స్త్రీని ఒక శక్తి యుక్తి ఉన్న వ్యక్తిగా గుర్తించగలిగిన నాడే ఏదేశమన్నా బాగుపడేది. ఏ సంఘమన్నా ఉద్ధరింపబడేది. కానీ, స్త్రీ ఉన్నతిని స్త్రీ, పురుషుడు ఇద్దరూ గుర్తించలేని దౌర్భాగ్యం మనది. ఏం, ఎందుకలా చూస్తున్నారు? నేను అన్నదాంట్లో అసత్యం ఏమన్నా ఉందా? పాపం సరళ. బంగారం లాంటి పిల్లండీ. పొట్ట చేత్తో పట్టుకొని ఇంత దూరం వచ్చి తన వాళ్ళందరికీ దూరంగా, ఒంటరిగా బతుకుతోంది. మీకెందుకండీ ఆపిల్ల సంగతి? ఎంతో గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో, తన వాళ్ళని కాపాడాలన్న దీక్షతో, తన తమ్ముణ్ణీ, చెల్లెల్ని చదివించాలన్న పట్టుదలతో మర్యాదగా బతుకుతోందిగా? మీరెందుకు ఆ పిల్ల వెంటబడడం? వస్తున్న చెత్త సినిమాల ప్రభావమా ఇది? మారుతున్న విలువల నిలువుదోపిడీనా ఇది? దీన్నే అంటారు పులిని చూసి నక్క వాతబెట్టుకోడం అని. అసలు మీరు పిచ్చి వ్యామోహంలో పడి అటు సరళ ఫ్యూచర్ గురించి గానీ, ఇటు నా ఫ్యూచర్ గురించి గానీ, పరువు ప్రతిష్ఠల గురించి గానీ, పర్యవసానం గురించి గానీ... దేన్ని గురించీ ఆలోచించ లేదు. ఇతరుల గురించి ఆలోచించకుండా,

కేవలం
తన గురించి
మాత్రమే ఆలోచించే మనిషి
చివరికి ఏకాకిగానే మిగిలిపోతాడు జీవితంలో. బహుశా మీకలా బతాలని ఉబలాటంగా ఉంది కాబోలు. పోనీ నేనే తప్పుకుంటా మీ జీవితం నుంచి" అంది నళిని ఏంతో ఆవేదనతో నిండిన స్వరంతో.

"ఛ. అదేంటి నళినీ అలా మాట్లాడుతున్నావ్? సారీ. తప్పయిపోయింది. అయినా ఏదో తమాషాకు సరళతో అలా బిహేవ్ చేసేవాడినే కానీ నిన్ను నిర్లక్ష్యం చేయాలనీ కాదు, నీ నుంచి విడిపోవాలనీ కాదు" అన్నాడు రమాకాంత్ కంగారుగా.

"ఏమిటి? తమాషానా? ఒక అమ్మాయి జీవితంతో ఆడుకోవడం తమాషానా? మరి ఇందాక ఎందుకంత కోపం వచ్చింది మా కొలీగ్‌పై? అసలు వేరే ఎవరన్నా అలా ప్రవర్తిస్తే ఆ పిల్లను కాపాడాల్సిన నైతిక బాధ్యత మీది. మీరు ఆ పిల్లకు పై ఆఫీసరు. మీరే అలా అసలు అలుసు తీసుకుంటే... కంచే చేను మేసినట్లు కాదా? మీరు సరళను మానసికంగా ఎంత కుంగదీశారో మీకు తెలీదండీ. చెప్పినా అర్థం కాదేమో. మనింటికి నిప్పు అంటుకున్నప్పుడే నీళ్ళు పోద్దాం లే అన్న దృక్పథం తప్పండీ. చూడండీ. మనిషికి మనిషికీ మధ్య ఆప్యాయత, అనురాగం, అనుబంధం, అనుభూతి... ఇవన్నీ ఉండడం మంచిదే. కానీ ఇవన్నీ అవగాహన అవ్వాలంటే స్పందించే హృదయం ఉండాలి. ఆ హృదయం ఎంతో విశాలంగా ఉండాలి. పైగా నిప్పుని దూరం నుంచే చూస్తే మంచిది. ముట్టుకోడానికి ప్రయత్నిస్తే చేతులు కాలతాయి. అసలు నాకో విషయం గురించి బాధగా ఉందండీ. మనం ఒకర్నొకరు ఎంతో ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాం. మీరు మరో అమ్మాయి పట్ల ఆకర్షితులవుతున్నారూ

అంటే,
అది మీలోనన్నా లోపం అయి ఉండాలి, నాలోనన్నా లోపం అయి ఉండాలి. లేదా మనిద్దరిలోనూ లోపం ఉందేమో ఒకర్నొకరు అర్థం చేసుకునే విషయంలో. ఏది ఏమైనా, మీరిక సరళను విసిగించనని, వెంటబడనని మాటివ్వాలి. ఆ పిల్లను రక్షిస్తానని మాటిచ్చాను. నా మాట మీరు లక్ష్య పెట్టకపోతే, ఇక నేను మీ జీవితం నుంచి శాశ్వతంగా తప్పుకోవాల్సి వస్తుంది. ఎలాగంటారా? చచ్చిపోయి" అంది నళిని కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతూంటే ఆపుకోడానికి ప్రయత్నిస్తూ. భార్యనలా చూస్తూంటే రమాకాంత్ మనసు నీరయిపోయింది. తను వేయబోతున్న తప్పటడుగు ఎన్నెన్ని అనర్థాలకు దారి తీస్తుందో గుర్తించేసరికి అతనికి కాళ్ళల్లో వణకు పుట్టుకొచ్చింది.

"అమ్మో. అంతంత పెద్ద మాటలు వద్దురా నళినీ. నువ్ లేందే నేను బతకగలనా ఏంటి? ఛ. ఫూలిష్ వీక్‌నెస్. హెల్ విత్ ఇట్. మరిక జన్మలో ఇలాంటి తప్పు చేయను. నన్ను క్షమించరా. ప్లీజ్" అంటూ పసిపిల్లవాడిలా నళిని ఒడిలో వాలిపోయాడు.

మర్నాడు అదురుతున్న గుండెలతో ఆఫీసుకు వచ్చిన సరళ రమాకాంత్‌లో వచ్చిన మార్పు చూసి హిమాలయ పర్వతాలను అధిరోహించినంతగా సంతోషపడిపోయింది. అదంతా నళిని చేసిన సత్కార్యానికి ఫలితం అని వెంటనే గ్రహించింది. మితిమీరిన ఆనందంలో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మనసులోనే కృతజ్ఞతాపూర్వకంగా నళినికి నమస్కరించుకుని, తేలిక పడ్డ హృదయంతో తన పనిలో నిమగ్నమైపోయింది, తను ఎన్నుకున్న తరుణోపాయం శ్రీరామరక్షలా తనను ఆశీర్వదిస్తూంటే. ■